క్లుప్తంగా

ఎన్నికల కమిషనా.. ఎన్డీఏ కమిషనా..?

సాలూరు: ఇది ఎన్నికల కమిషనో లేక ఎన్డీఏ కూటమి కమిషనో అర్థం కావడం లేదంటూ సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర మండిపడ్డారు. సోమవారం పలువురు ఓటర్లు రాజన్నదొర వద్దకు వచ్చి ఈవీఎంలలో ప్రతిపక్ష సైకిల్ గుర్తు స్పష్టంగా కనిపిస్తోందని, వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తు స్పష్టంగా కనిపించకపోవడంతో వృద్ధులైన ఓటర్లు దాన్ని గుర్తుపట్టలేక పోతున్నారని తెలిపారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ.. పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులు అందరికీ స్పష్టంగా కనిపించేలా రూపొందించాల్సి ఉంటుందన్నారు. కానీ ఇటువంటి సంఘటనలు ఎన్నికల కమిషన్ పనితీరుకు అద్దం పడుతున్నాయన్నారు. దీనిపై న్యాయస్థానాలు స్పందించకుంటే దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యే ప్రమాదముం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరు చూస్తుంటే అది ఎన్నికల కమిషన్ కాదని, ఎన్డీఏ కమిషన్‌లా పనిచేస్తోందని ఎద్దేవా చేశారు.

రేగిడిలో భారీ వర్షం

రేగిడి: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మేఘావృతమై చిరుగాలులతో కూడిన వర్షం కురిసింది. వేసవి ఎండల కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది.

ఓటు వినియోగించుకున్న 104 ఏళ్ల వృద్ధురాలు


ఓటుహక్కు వినియోగించుకున్న గున్నరాజమ్మ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బుక్కా వీధికి చెందిన 104 ఏళ్ల మండా గున్నరాజమ్మ అనే వృద్ధురాలు తన ఓటుహక్కును వినియోగించుకుంది. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని, స్థానిక సారధి బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌కు కుటుంబీకుల సహాయంతో సోమవారం వెళ్లిన ఆమె నేను సైతం అంటూ ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కనబరిచారు. ఓటు ఉన్నా ఓటు వేసేందుకు ముందుకురాని ఎంతోమందికి ఆమె ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గతం కంటే ఎక్కువ మెజార్టీ

• బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ పాఠశాలలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సతీమణి పద్మావతితో కలిసి సోమవారం ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్‌లో మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు.

ఓటు వినియోగించుకున్న ఐసీఏఎస్ అధికారి


స్వగ్రామం వచ్చి, ఓటు వేసిన ఐసీఏఎస్ ప్రియాంక నాషిన్

రేగిడి: ఐసీఏఎస్ ప్రియాంక నాషిన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమె స్వగ్రామమైన మండలంలోని ఆడవరం వచ్చి మరీ ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. ఆమె నాలుగు రాష్ట్రాల ఆర్థిక శాఖ సహాయక కంట్రోలర్ జనరల్‌గా(ఐసీఏఎస్) పనిచేస్తున్నారు. ఎంతో బిజీబిజీగా ఉండే ఆమె ఓటు వేసేందుకు స్వగ్రామం రావడం, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సత్యసాయి భక్తుల సేవాభావం

రాజాం: సత్యసాయి భక్తులు సేవాభావం చాటుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల పోలింగ్ కేంద్రాల సమీపంలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు మజ్జిగ అందజేశారు. వేసవి నేపథ్యంలో ఓటర్ల దాహార్తి తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ దౌర్జన్యం

రాజాం: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పోలింగ్ కేంద్రం వద్ద కొంతమంది టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రంలోకి ఐదు నుంచి పది మంది వరకు ఒకే దఫా చొరబడడం, ఓటర్లను మభ్యపెట్టడం వంటివి చేశారు. పోలీసులు, ఎన్నికల సిబ్బంది హెచ్చరించినా మళ్లీమళ్లీ అదే పనిగా వ్యవహరించి, ఓటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బొద్దాం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓ టీడీపీ కార్యకర్త డమ్మీ ఈవీఎం పట్టుకుని, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అత్యుత్సాహం ప్రదర్శించాడు.

పార్వతీపురంలో.. ప్రశాంతంగా పోలింగ్

పార్వతీపురం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం

- ఉదయం 9 గంటలకు 8.8 శాతం
- 11 గంటలకు 18.52 శాతం
- మధ్యాహ్నం 1గంటకు 43.27 శాతం
- 3 గంటలకు 54.62 శాతం
- 5 గంటలకు 68.21 శాతం

- పోటెత్తిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన జిల్లా యంత్రాంగం


ఓటు హక్కు వినియోగించున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


ఓటు హక్కు వినియోగించున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి


బలిజిపేట: నారాయణపురంలో బారులు తీరిన ఓటర్లు


బలిజిపేట: బలిజిపేటలో ఓటువేసేందుకు వెళ్తున్న దివ్యాంగుడు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పగడ్బందీ ఏర్పాట్లు చేపట్టడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఆర్డీఓ కె.హేమలత పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియో గ్రఫీ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిశీలించి పోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బ్రాంచ్ హై స్కూల్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఆయన సతీమణి కరుణ, జాయింట్ కలెక్టర్ శోభిక, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, బలిజిపేట మండలం చిలకలపల్లిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బలిజిపేట: మండలంలో 67 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. వెంగాపురం పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో 30 నిమిషాల పాటు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఎన్నికల అధికారులు ఈవీఎంను సరిచేయడంతో ఓటింగ్ తిరిగి ప్రారంభమైంది. పలు కేంద్రాల్లో ఓటింగ్ నెమ్మదిగా సాగడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పలు కేంద్రాల్లో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బలిజిపేటలో క్యూలో ఉన్న ఓటర్లపై పోలీసులు లాఠీలతో కొట్టడంతో మహిళా ఓటర్లు భయభ్రాంతులకు గురై ఓట్లు వేయకుండా వెళ్లిపోయినట్టు అక్కడివారు తెలిపారు. చిలకలపల్లి పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సీతానగరం: మండలంలోని 62 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీతానగరంతో పాటు పలు పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు.


పార్వతీపురం టౌన్: నర్సిపురం పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు స్లిప్పులు చూపిస్తున్న మహిళా ఓటర్లు


పార్వతీపురం టౌన్: జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


సీతానగరం: వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి మోసుకుంటూ తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు


బలిజిపేట: చెల్లంపేటలో ఓటువేసిన దివ్యాంగుడిని ట్రై సైకిల్‌పై బయటకు తీసుకువెళ్తున్న కానిస్టేబుల్, సిబ్బంది


సీతానగరం: పోలింగ్ కేంద్రాన్ని, సందర్శించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్


సీతానగరం: పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని, పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్


సీతానగరం: ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు


పార్వతీపురం టౌన్: దివ్యాంగుడిని పోలింగ్ స్టేషన్‌ను తీసుకువెళ్తున్న సిబ్బంది

సాలూరులో సజావుగా...


మక్కువ: పనసభద్రలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు


మక్కువ: మార్కొండపుట్టిలో బారులు తీరిన ఓటర్లు

సాలూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సాలూరు అసెంబ్లీకు సంబంధించి సాలూరు మున్సిపాలిటీ, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఓటింగ్ మందకొడిగా సాగింది. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగ ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్యాన్ గుర్తు ఈవీఎంలపై స్పష్టంగా కనిపించలేదని, తీక్షణంగా చూస్తేనే గుర్తు కనిపించిందని పలువురు ఓటర్లు తెలపడం జరిగింది. సాలూరు మండలం కురుకూటి, తోణాం, మోసంగి, నేరెళ్లవలస తదితర పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పలుమార్లు మొరాయించడంతో ఓటింగ్ ఆలస్యమైంది. పట్టణంలోని గరల్స్ హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర, తన భార్య రోజమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో పెదపధం పోలింగ్ బూత్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వేదసమాజం, బంగారమ్మ కాలనీ, గుమడాం, శివరాంపురం, తోణాం, నేరెళ్లవలస, పాంచాలి తదితర పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులు వెంటనే స్పందించి వాటిని అదుపుచేశారు.

పోలింగ్ కేంద్రంలోకి ఫోన్లు ఎలా అనుమతిస్తారు?

పోలింగ్ కేంద్రంలోని సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదని నిబంధన ఉన్నా.. పట్టణంలోని 2వ వార్డు పోలింగ్ కేంద్రంలో పలువురు టీడీపీ నాయకులు సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లారు. దీన్ని గుర్తించిన రాజన్నదొర వెంటనే స్పందిస్తూ.. పోలింగ్ కేంద్రంలోకి ఫోన్లతో ఎవరినీ అనుమతించని మీరు టీడీపీ నాయకులను ఎలా అనుమతిస్తారని అక్కడున్న పోలీసు సిబ్బందిని నిలదీశారు. పోలీసు సిబ్బంది తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సాలూరు మండల శివరాంపురం పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించగా.. వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది.

– మక్కువ: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను అధికారులు ప్రశాంతంగా చేపట్టారు. ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మక్కువలో ఈవీఎంలు మొరాయించగా.. అధికారులు కొత్తవాటిని తెప్పించి పోలింగ్ వేగవంతం చేశారు. సీఐ ప్రసాద్, ఎస్‌ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.


సాలూరు: ఓటు హక్కును వినియోగించుకుని వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర


సాలూరు: ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, కుటుంబీకులు


సాలూరు: రాజన్నదొరకు దురుసుగా సమాధానం చెపుతున్న పోలీస్


మక్కువ: మక్కువ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాలూరు సీఐ ప్రసాద్


మక్కువ: ఓటుహక్కు వినుయోగించుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు


సాలూరు: పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు


మక్కువ: ఎర్రసామంతవలస పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 7 గంటలకే చేరుకున్న ఓటర్లు